VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ సోమవారం 27 ఏప్రిల్ 2026
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 282
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## ఇక మా టైం మొదలైంది

**తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో కవిత కొత్త పార్టీ**

**'మీ టైం అయిపోయింది, మా టైం మొదలైంది' అంటూ సంచలన ట్వీట్**

**పార్టీ ఆవిర్భావ సభలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై తీవ్ర విమర్శలు**

**తండ్రి కేసీఆర్ పార్టీ పాత పేరుతోనే కొత్త రాజకీయ ప్రయాణం**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ ప్రయాణాన్ని అధికారికంగా ప్రారంభించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన ఆమె, ఆ తర్వాత చేసిన తొలి ట్వీట్ రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. 'మీ టైం పూర్తయ్యింది.. మా టైం మొదలైంది" అంటూ ఎక్స్‌లో ఆమె పోస్టు పెట్టారు హైదరాబాద్‌లోని మునీరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కవిత తన పార్టీ పేరును అధికారికంగా ప్రకటించడం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాజకీయాల్లో తన పార్టీ ఒక కొత్త శక్తిగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేస్తున్న కవిత, ఎట్టకేలకు సొంత పార్టీతో ప్రజల ముందుకు వచ్చారు. ఈ పరిణామంలో అత్యంత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, తన తండ్రి కేసీఆర్ స్థాపించిన పార్టీ అసలు పేరు 'తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)'ని పోలి ఉండేలా 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' అని నామకరణం చేయడం. బీఆర్ఎస్ నుంచి వేరుగా, సొంత రాజకీయ అస్తిత్వం కోసం కవిత ఈ నిర్ణయం తీసుకోవడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఆమె చేసిన ట్వీట్, ఎవరిని ఉద్దేశించిందనే దానిపై ఊహాగానాలు మొదలయ్యాయి.



## బెంగాల్లో గూండాల రాజ్యం

**మహిళలకు భద్రత లేదు**

**అంతటా కమీషన్ల సంస్కృతి**

**మమత ప్రభుత్వంపై ప్రధాని ధ్వజం**

ఆరామ్‌బాగ్/ కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వం రాష్ట్ర సచివాలయం నుంచి కాకుండా, పార్టీ ఆశ్రయమిస్తున్న గూండాలు, నేరస్థుల ద్వారా నడుస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ప్రభుత్వం దారి తప్పినప్పుడల్లా కలకత్తా హైకోర్టుగానీ, సుప్రీం కోర్టుగానీ జోక్యం చేసుకుని దానిని సరిదిద్దాల్సి వస్తోందని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో వివిధ సభల్లో ఆదివారం మోదీ ప్రసంగించారు. హుగ్లీ జిల్లాలోని బంగాళాదుంప రైతుల దుస్థితి గురించి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 'సిండికేట్ రాజ్' నడుస్తోందని మండిపడ్డారు. రైతుల దగ్గర తక్కువ ధరకు పంటను కొనుగోలు చేసి, బయట ఎక్కువ ధరకు అమ్ముకుంటూ గూండాలు లాభపడుతున్నారని ఆరోపించారు. భాజపా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేశాక ఈ కమీషన్ల సంస్కృతికి అంతం పలుకుతామని చెప్పారు. బెంగాల్‌లో భాజపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగే తొలి క్యాబినెట్ సమావేశంలోనే కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం 'ఆయుష్మాన్ భారత్' అమలుకు ఆమోదం తెలుపుతామని మోదీ హామీ ఇచ్చారు. టీఎంసీ పాలనలో మహిళలపై మునుపెన్నడూ లేని స్థాయిలో దాడులు జరుగుతున్నాయని, నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు పరిశ్రమలకు నిలయంగా ఉన్న హుగ్లీ జిల్లా నుంచి టాటా మోటార్స్ తదితర కంపెనీలు వెళ్లిపోవడాన్ని ప్రధాని ప్రస్తావించారు. భాజపా అధికారంలోకి వస్తే హుగ్లీని దేశానికే పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని వాగ్దానం చేశారు.





## ప్రజా'వాణి' వినాలి

**ఫిర్యాదుల పరిష్కారంలో రాజీ వద్దు.. ఆలస్యమైతే అధికారులదే బాధ్యత**

**ప్రజావాణిపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

**రాష్ట్ర, జిల్లా స్థాయి నుంచి రెవెన్యూ డివిజన్ స్థాయికి.. తర్వాత మండల స్థాయికి విస్తరించాలి**

**ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల అధికారులకు పూర్తి అధికారం**

**గడువులోగా పరిష్కారం.. ట్రాకింగ్‌కు డిజిటల్ ప్లాట్‌ఫాం**

-2లో

జనగణనలో భాగంగా ఆదివారం లోక్‌భవన్‌లో స్వీయ గణన ప్రక్రియను ప్రారంభిస్తున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో స్వీయ గణనలో వివరాలు నమోదు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుసటి రోజు 2023 డిసెంబర్ 8న మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. నాటి నుంచి ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజావాణి నిర్వహిస్తున్నారు.




-2లో

## నేడు భారాస ఆవిర్భావ దినోత్సవం



## ట్రంప్ విందులో పేలిన తుపాకీ

**సురక్షితంగా బయటపడ్డ అధ్యక్ష, ఉపాధ్యక్షులు**

**ఘటనాస్థలిలోనే అదుపులోకి నిందితుడు**

**రెండేళ్లలో ఇలాంటిది మూడోసారి**

**దాడి యత్నాన్ని ఖండించిన మోదీ, ప్రపంచ దేశాల నేతలు**

శ్వేత సౌధ విలేకరుల డిన్నర్ జరుగుతున్న హోటల్‌లోకి దూసుకొచ్చిన దుండగుడు భద్రతా సిబ్బందిపైకి కాల్పులు వెంటనే అప్రమత్తమైన సీక్రెట్ ఏజెంట్లు విందు జరుగుతున్న బాల్‌రూంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో తప్పిన ముప్పు

-2లో



## పెట్రోల్, డీజిల్ ఫుల్‌స్టాక్.. బంకుల్లో 'నో స్టాక్'!

**డబ్బు కట్టినా సరఫరా చేయట్లేదంటున్న డీలర్లు**

**ప్రభావం చూపిస్తున్న రూపాయి విలువ, ఆయిల్ కంపెనీల నష్టాలు**

**ఎన్నికలయ్యాక ధరలు పెరుగుతాయన్న ఆందోళనలు**

**వేంసూరు వద్ద పెట్రోల్, డీజిల్ కోసం క్యూలో పెట్టిన డబ్బాలు**

-2లో



## అంబేడ్కర్ ఆశయాలను కాంగ్రెస్ కాలరాస్తోంది

అంతకుముందు ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు, దళితులు, గిరిజనులు చట్టసభల్లో అడుగు పెట్టకుండా కాంగ్రెస్ దశాబ్దాలుగా అడ్డు పడుతోందని విమర్శించారు.

-2లో

## తెలంగాణపై మళ్లీ కుట్రలు

**ఎన్ని కుటిల యత్నాలు చేసినా.. వచ్చేది కేసీఆరే**

**గుర్తింపు కోసమే రేవంత్ విమర్శలు**

**కేటీఆర్ ధ్వజం**

గ్యారంటీ కార్డుల పేరు చెప్పి ప్రజలందరికీ రంగుల చిత్రం చూపించి మోసం చేశారు. 30 నెలల తర్వాత కూడా ఒక్క పథకాన్ని అమలు చేయలేదు. నల్గొండ జిల్లాలోని ఫ్లోరోసిస్ సమస్యను 60 ఏళ్లలో కాంగ్రెస్, తెదేపా ప్రభుత్వాలు పట్టించుకోలేదు.

-2లో



వేగుచుక్క

## నేడు భారాస ఆవిర్భావ దినోత్సవం




హైదరాబాద్: భారాస ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా వేడుకలను నిర్వహించేందుకు ఆ పార్టీ సన్నద్ధమైంది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల మాజీ ఛైర్మన్లు హాజరు కానున్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, ప్రజా సమస్యలు, పార్టీ శ్రేణుల పోరాటాలు, తాజా రాజకీయ సమీకరణాలు, పార్టీ కార్యవర్గ విస్తరణ, సభ్యత్వ నమోదు తదితర అంశాలపై పార్టీ అధినేత దిశానిర్దేశం చేయనున్నారు. భారాస ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి గ్రామం, పట్టణం, నియోజకవర్గం, జిల్లా కేంద్రాల్లో పార్టీ జెండాలను ఎగురవేయాలని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఆదివారం పార్టీ శ్రేణులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. "ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ ఆదేశాల మేరకు ఈసారి ప్లీనరీని కేవలం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికే పరిమితం చేశాం. తెలంగాణ భవన్‌లో సమావేశానికి పరిమిత సంఖ్యలోనే ప్రవేశం ఉంటుంది. ఆహ్వానం ఉన్నవారు ఉదయం స్థానికంగా గులాబీ జెండా పండుగను ముగించుకుని మధ్యాహ్నం 1:30 గంటల కల్లా హైదరాబాద్ చేరుకోవాలి. మిగతా నాయకులు, కార్యకర్తలు తమ నియోజకవర్గాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించాలి' అని కేటీఆర్ సూచించారు.

## తెలంగాణపై మళ్లీ కుట్రలు

హైదరాబాద్: తెలంగాణపై మళ్లీ కుట్రలు ప్రారంభమయ్యాయని, అన్ని తెలంగాణ వ్యతిరేక శక్తులు మెల్లిగా ఏకమవుతున్నాయని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా.. రానున్న శాసనసభ ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్‌ని తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని ధీమా వ్యక్తంచేశారు. దిల్లీ విమానం ఎక్కడం, దిగడం తప్ప ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి గడిచిన రెండున్నరేళ్లలో రాష్ట్రానికి చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. ఆయన్ను ముఖ్యమంత్రిగా ప్రజలెవరూ గుర్తించడం లేదని, అందుకే తన గుర్తింపు కోసం తెలంగాణ సాధకుడు కేసీఆర్‌పై అడ్డగోలు విమర్శలు చేస్తున్నారన్నారు. భారాస పార్టీలో చేరిన పిల్లుట్ల రఘుకు గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన కేటీఆర్, చిత్రంలో జగదీశ్‌రెడ్డి, బడుగుల లింగయ్యయాదవ్, తాతామధు, రాకేశ్‌రెడ్డిపార్టీలు మారిన తర్వాత ఏ నాయకుడికి ఉనికి ఉండదు




పార్టీలు మారిన తర్వాత ఏ నాయకుడికి ఉనికి ఉండదని, హుజూర్‌నగర్‌లో పార్టీ మారిన మాజీ ఎమ్మెల్యే కనీసం తన సొంత గ్రామంలో సర్పంచిని కూడా గెలిపించుకోలేని పరిస్థితికి దిగజారిపోయారని ఎద్దేవా చేశారు. హుజూర్‌నగర్ ప్రాంతంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని నిలదీశారు. తెలంగాణభవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేత పిల్లుట్ల రఘు ఆదివారం హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన నాయకులతో కలిసి భారాస పార్టీలో చేరారు. వారికి గులాబీ పార్టీ కండువా కప్పి కేటీఆర్ ఆహ్వానించి మాట్లాడారు. "అధికారంలోకి రాగానే 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్..రెండున్నర సంవత్సరాలు దాటినా..కనీసం వాటిని ప్రస్తావించడం లేదు. గ్యారంటీ కార్డుల పేరు చెప్పి ప్రజలందరికీ రంగుల చిత్రం చూపించి మోసం చేశారు. 30 నెలల తర్వాత కూడా ఒక్క పథకాన్ని అమలు చేయలేదు. నల్గొండ జిల్లాలోని ఫ్లోరోసిస్ సమస్యను 60 ఏళ్లలో కాంగ్రెస్, తెదేపా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. మిషన్ భగీరథతో కేసీఆర్ తరిమికొట్టారు. పంట పొలాలకు సాగునీరు అందించేలా చేసిన నాయకుడు కేసీఆర్. దేశానికే తలమానికంగా యాదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని చరిత్రలో నిలిచిపోయేలా రూ. 1,800 కోట్లతో అత్యద్భుత పుణ్యక్షేత్రంగా తయారుచేసింది కేసీఆరే. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ. 3,70,000 కోట్ల అప్పు తెచ్చి.. ఇప్పటిదాకా ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. కాంట్రాక్టుల కమీషన్లకే ఖర్చుపెట్టారు" అని కేటీఆర్ మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ నేతలు జగదీశ్‌రెడ్డి, బడుగుల లింగయ్యయాదవ్, తాతామధు, రాకేశ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## ట్రంప్ విందులో పేలిన తుపాకీ



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మరోసారి హత్యాయత్నం జరిగింది. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో త్రుటిలో ఆయన, సతీమణి మెలనియా, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దంపతులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. తుపాకులు, కత్తులతో వచ్చిన ఆగంతుకుడు 'శ్వేతసౌధం విలేకరుల సంఘం' విందు జరుగుతున్న హోటల్‌లోని బాల్‌రూంవైపు వెళ్తూ కాల్పులకు దిగడంతో ఒక్కసారిగా భీతావహ వాతావరణం నెలకొంది. ట్రంప్‌ను రక్షించడానికి సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ఆగమేఘాలపై స్పందించగా.. కాల్పుల చప్పుళు వినగానే ప్రాణభయంతో పలువురు అతిథులు టేబుళ్ల కింద దాక్కోవాల్సి వచ్చింది. నిందితుడు కోల్ టొమాస్ అలెన్‌ను (31) అక్కడికక్కడే నిర్బంధంలో తీసుకుని సంకెళ్లు వేశారు. అతడి వద్ద ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. ఘటన తర్వాత కూడా విందు కొనసాగించాలని ట్రంప్ గట్టిగా భావించినా.. భద్రతాధికారులు ఆ ప్రాంగణాన్ని తక్షణం ఖాళీ చేయడమే మేలని సూచించి ఆయనను శ్వేతసౌధానికి తరలించారు. ట్రంప్‌పై దాడికి ప్రయత్నించడం రెండేళ్లలో ఇది మూడోసారి. ఏం జరిగిందంటే..వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్'(డబ్ల్యూహెచ్‌సీఏ) ఏడాదికి ఒకసారి విందు సమావేశాన్ని నిర్వహిస్తుంటుంది. శ్వేతసౌధానికి సంబంధించిన వార్తలు రాసే పాత్రికేయులు తమ వృత్తి గౌరవార్థం ఇచ్చే ఈ విందుకు అధ్యక్షుడు హాజరై మాట్లాడటం పరిపాటి. అందులో భాగంగా శ్వేతసౌధానికి మైలు దూరంలోని 'వాషింగ్టన్ హిల్టన్' హోటల్లో శనివారం రాత్రి విందు జరుగుతున్నప్పుడు 8.34 గంటల సమయంలో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. హాల్ బయట కలకలాన్ని గుర్తించి ట్రంప్ దంపతుల చుట్టూ భద్రతాధికారులు వలయంగా ఏర్పడి వేదిక వద్ద నుంచి తరలించారు. వేదిక నుంచి ట్రంప్ దిగుతూ కొంత తడబడగా సిబ్బంది చేయూతనిచ్చారు. ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, ఉష దంపతులనూ సిబ్బంది బయటకు తీసుకెళ్లారు.

నిందితుడి బస అదే హోటల్లో.. కాలిఫోర్నియాలోని టొరాన్స్‌కు చెందిన నిందితుడు అలెన్ అదే హోటల్లో బస చేశాడని అధికారులు గుర్తించారు. అతడు మెకానికల్ ఇంజినీరింగ్ చేసి, ఆ తర్వాత కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తి చేసిన ప్రోగ్రామర్. కొత్తకొత్త సాంకేతికతలు కనిపెట్టేవాడు. గతంలో డెమోక్రటిక్ పార్టీకి కొద్దిపాటి విరాళం ఇచ్చాడు. ఒక విద్యాసంస్థలో ఆరేళ్లు పనిచేసినట్లు సామాజిక మాధ్యమ ప్రొఫైల్ చెబుతోంది. ఘటన వెనుక అతనొక్కడే ఉన్నాడని భావిస్తున్నారు. ఆయుధాలను గత రెండేళ్లలో సమీకరించుకున్నాడని, ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ అధికార యంత్రాంగంలో కొందరిపై గురిపెట్టినట్లు సామాజిక మాధ్యమాల్లోనూ చేప్పేవాడని తెలుస్తోంది. మాదకద్రవ్యాల పడవలపై దాడులు సహా అనేక అంశాలను తప్పుబట్టాడు. అతని కుటుంబసభ్యులు కనెక్టికట్ పోలీసులను ముందే అప్రమత్తం చేశారని ట్రంప్ వెల్లడించారు.

వేల మంది ఉండగా.. డబ్ల్యూహెచ్‌సీఏ విందుకు అతిథులుగా కొన్ని వేల మంది హాజరయ్యారు. ఇది మొదలైన కొన్ని నిమిషాల్లోనే తీవ్ర కలకలం రేగింది. అధ్యక్షుడు, సీనియర్ అధికారులు, వివిధ రంగాల ప్రముఖులున్న హాల్ వద్దకు వెళ్లే క్రమంలో లాబీలోకి మారణాయుధాలతో దుండగుడు చొరబడ్డాడు. బారికేడ్లను దాటుకుని వేగంగా అలెన్ వస్తుండగా సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అతడివైపు పరుగుతీయడం, ఆ ప్రయత్నంలో ఒక అధికారిపై కాల్పులు జరగడం గురించి ట్రంప్ ఒక వీడియో విడుదల చేశారు. గాయపడ్డ అధికారి కోలుకుంటున్నారు.

ప్రమాదం గురించి తెలియగానే పాత్రికేయులు ఫోన్లో తాజా కబురును తమ మీడియాకు చేరవేయడంలో తలమునకలయ్యారు. సందట్లో సడేమియా అన్నట్లు కొందరు అతిథులు ఖరీదైన మద్యం సీసాలను ఎత్తుకుపోయారు. సమావేశంలో పాల్గొన్న రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో, హౌస్ స్పీకర్ మైక్ జాన్సన్, డెమోక్రటిక్ పక్ష నేత హకీమ్ జెఫ్రీస్ తదితరులు ఘటనను ఖండించారు.

ప్రభావవంతుల వెనుకే పడతారు: ట్రంప్

తాను ఒంటరినని నిందితుడు భావించి ఉంటాడని.. ఘటన జరిగిన రెండు గంటల తర్వాత ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రభావవంతులైన వ్యక్తుల వెనుక ఇలాంటివారు పడుతుంటారని చెప్పారు. శ్వేతసౌధంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చూడటానికి బాగున్న నిందితుడు అలా ఎందుకు చేశాడో తెలియడం లేదన్నారు. తాను ప్రమాదకరమైన విధుల్లో ఉన్నట్లు భార్యకూడా పలుమార్లు చెప్పిందని, నిజానికి అది ఇద్దరికీ వర్తిస్తుందని అన్నారు. శ్వేతసౌధంలోనే అత్యంత భద్రతతో బాల్‌రూం ఏర్పాటుచేయాల్సిన ఆవశ్యకతను తాజా ఘటన చాటిచెప్పిందన్నారు. ఇప్పటికే ఇది నిర్మాణంలో ఉందని గుర్తుచేశారు.

అధ్యక్షుడిగా తొలిసారి వచ్చిన ట్రంప్

ట్రంప్ గతంలో అతిథిగా రెండుసార్లు ఈ వార్షిక విందుకు వచ్చినా అధ్యక్షుడిగా హాజరుకావడం ఇదే తొలిసారి. మొదటి విడత అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన రాలేదు. ఆయన ఏం చెబుతారో వినేందుకు అందరూ ఆసక్తిగా ఎదురుచూశారు.

ఖండించిన మోదీ, ప్రపంచ దేశాధినేతలు

ట్రంప్‌పై హత్యాయత్నాన్ని భారత్ సహా వివిధ దేశాలు ఖండించాయి. ట్రంప్ దంపతులు, ఉపాధ్యక్షుడు వాన్స్ దంపతులు సురక్షితంగా బయటపడటం ఊరటనిచ్చిందని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. హింసను నిర్ద్వందంగా ఖండించాలని పిలుపునిచ్చారు. ట్రంప్‌తో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఫోన్లో మాట్లాడి, కాల్పుల ఘటనను ఖండించారు. దాడి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ అన్నారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్, జపాన్ ప్రధాని సనాయె తకాయిచి, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ తదితరులు ఖండించారు.

'ఓ ట్రే పడిపోతున్నట్లు కొంతదూరం నుంచి పెద్దగా శబ్దం వచ్చింది. అది పలుమార్లు వినిపించింది. అవి కాల్పులన్న విషయాన్ని మెలనియా గుర్తించింది. మేం ఉన్న హాల్‌లోకి దుండగుడు రాలేదు. భద్రతా సిబ్బంది అతడిని బయటే పట్టుకున్నారు. ఓ భద్రతాధికారికి తూటారక్షక కవచం ఉండటంతో ఆయనపై కాల్పులు జరిగినా సురక్షితంగా బయటపడ్డారు. అధ్యక్షుడిగా ఉండటం ప్రమాదకరమైన పనైనా నేను భయపడలేదు.

## ప్రజా'వాణి' వినాలి

హైదరాబాద్: ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా ఇకపై రెవెన్యూ డివిజన్ స్థాయికి, తర్వాత దశలో మండల స్థాయికి విస్తరించాలన్నారు. దూర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని చెప్పారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుసటి రోజు 2023 డిసెంబర్ 8న మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. నాటి నుంచి ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజావాణి నిర్వహిస్తున్నారు. అన్ని శాఖల అధికారులు అక్కడికక్కడే ప్రజల అర్జీలు, దరఖాస్తులను స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే చర్యలు చేపడుతున్నా రు. జిల్లా స్థాయిలోనూ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతివారం ప్రజావాణి నిర్వహిస్తున్నారు. పైఅధికారికి ఫిర్యాదు ఆటో ఎస్కలేషన్..ప్రతిస్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలన్నారు. ఒకస్థాయిలో పరిష్కారం కాకపోతే, పైస్థాయి అధికారికి అర్జీ అందేలా ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను అమలు చేయాలని చెప్పారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆలస్యమైతే అధికారులదే బాధ్యత అని చెప్పారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతుందని, కింది స్థాయిలోనే కొన్ని పరిష్కరించే వీలుంటుందని సీఎం అభిప్రాయపడ్డారు.

## పెట్రోల్, డీజిల్ ఫుల్‌స్టాక్.. బంకుల్లో 'నో స్టాక్'!

హైదరాబాద్: అందులోనూ డీజిల్ సమస్య అధికం. శుక్రవారం నుంచి ఈ సమస్య పెరుగుతున్నట్టే కనిపిస్తోంది. మరోవైపు ఆయిల్ కంపెనీల నుంచి ఇంధనం సకాలంలో సరఫరా కావడం లేదని పెట్రోల్ బంకుల యజమానులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఓటింగ్ పూర్తయ్యాక పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ఖాయమన్న భయం సమస్యను తీవ్రం చేస్తోంది. రాష్ట్రంలో 4 వేలకు పైగా పెట్రోల్ బంకులు ఉన్నాయి. గతంలో ముందు పెట్రోల్, డీజిల్ సరఫరా చేసి.. సాయంత్రం లేదా మర్నాడు డబ్బులు తీసుకునే వెసులుబాటును ఆయిల్ కంపెనీలు ఇచ్చేవి. ఇరాన్–అమెరికా యుద్ధంతో పరిస్థితి మారింది. డబ్బులు కడితేనే ఆయిల్ ట్యాంకర్లను పంపించే విధానం మొదలైంది. ఇప్పుడయితే డబ్బులు కట్టి ఇండెంట్ పెట్టినా రెండు, మూడు రోజులకు గానీ ట్యాంకర్లు రావడం లేదని డీలర్లు చెబుతున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25% బంకులు తాత్కాలికంగా మూతపడ్డట్లు తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తెలిపింది. గతంలో అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ధరలు మార్చుకునే డైనమిక్ విధానం ఉండేది. ఫలితంగా రోజువారీగా ధరలు మారేవి. ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పుడు స్థిరంగానే ఉంటున్నాయి. అయితే పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఆయిల్ కంపెనీలు నష్టాలు చవిచూస్తున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గిపోవడం, దాడుల నేపథ్యంలో నౌకల బీమా ప్రీమియం పెరగడం, అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు ఆకాశాన్నంటడం.. తదితర కారణాలతో నష్టాలు పెరుగుతున్నాయని ఆయిల్ కంపెనీలు చెబుతున్నాయి. వీటిని తగ్గించుకునేందుకు సరఫరా కూడా తగ్గిస్తున్నాయని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. 'డబ్బులు కట్టినా మూడురోజుల వరకు ఇంధనం పంపించకపోతే బంకును మూసివేయాల్సి వస్తోంది. వారానికి రెండ్రోజుల చొప్పున నెలకు ఎనిమిది రోజులు మూసివేస్తే.. నిర్వహణ ఖర్చులు మాత్రం తగ్గవు కదా?' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ కాలరాస్తోంది: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: మహిళల సాధికారతను, అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కాలరాస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం సోమాజిగూడలో జరిగిన అంబేద్కర్ జయంతి ముగింపు ఉత్సవాల్లో మరో కేంద్ర మంత్రి బండి సంజయ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తదితరులతో కలిసి పాల్గొన్నారు. అంతకుముందు ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు, దళితులు, గిరిజనులు చట్టసభల్లో అడుగు పెట్టకుండా కాంగ్రెస్ దశాబ్దాలుగా అడ్డు పడుతోందని విమర్శించారు. రిజర్వేషన్ బిల్లు విషయంలో భారాస సైతం తన బాధ్యతను విస్మరించి.. ప్రజలను తప్పుదోవ పట్టించిందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతోందంటూ రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి, స్టాలిన్ వంటి నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బీసీ జనగణన తొలిసారిగా చేస్తున్న ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. రాష్ట్రానికి మోదీప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారి తెలంగాణ రాష్ట్రానికి దాదాపు రూ. 700 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వస్తున్నారని.. ఈ పర్యటన రాష్ట్ర వికాసానికి కొత్త దిశను చూపనుందన్నారు కిషన్‌రెడ్డి. మే 10న ప్రారంభోత్సవాల అనంతరం పరేడ్ మైదానంలో బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. బండి సంజయ్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లును మోదీ ప్రభుత్వం తీసుకొస్తే కాంగ్రెస్ అడ్డుకుని మహిళా ద్రోహిగా మారిందన్నారు. అంబేద్కర్‌కు భారతరత్న ఇవ్వడానికి ఒప్పుకోని కాంగ్రెస్ ఆయన్ను ఓడించిన వ్యక్తికి ఇచ్చిందని విమర్శించారు. బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ.. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. సమావేశంలో చింతల రామచంద్రారెడ్డి, ప్రేమ్‌సింగ్ రాథోడ్, గౌతంరావు, ఆనంద్‌గౌడ్, బంగారు శృతి, వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా "వాసవి మాత" జయంతి వేడుకలు.











**ఆభరణాలు సమర్పించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా..**

**కన్నులపండుగగా శోభాయాత్ర...**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి పురస్కరించుకొని ఆదివారం కిషన్ గంజ్ లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతూ... ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం సంతోషకరమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ఆర్యవైశ్యులు ఎప్పుడు ముందుంటారని పేర్కొన్నారు. అంతకుముందు అమ్మవారికి ఆభరణాలు సమర్పించారు.

**వైభవంగా శోభాయాత్ర...**

నగరంలోని పెద్ద బజారులో గల నగరేశ్వర దేవాలయం వద్ద ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. శివాజీ నగర్ పెద్ద బజార్ గాంధీచౌక్ మీదుగా కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగింది. ఒగ్గు కళాకారులు, పులి వేషాలు, బోనాలు, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు ఆధ్యాంతం కన్నుల పండుగ కొనసాగింది.

**ఘనంగా డోలారోహణ...**

నగరంలోని కిషన్ గంజ్ వాసవి మాత ఆలయంలో అమ్మవారి నామకరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా వాసవి మాతకు నామకరణం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, ఆలయ కమిటీ అధ్యక్షుడు పాత్తే రవి కుమార్,

ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర, కోశాధికారి మామిడి శేఖర్, పట్టణ సంఘం అధ్యక్షుడు ధనపాల్ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# స్నేహ సొసైటీ "జ్యోతి, సిద్దయ్యలు" సమాజానికి ఆదర్శం.

**డాక్టర్ మహిపాల్, డాక్టర్ సవితా రాణి వెల్లడి.**

**సొసైటీ 34వ సాధారణ సర్వసభ్య సమావేశం.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**







దివ్యాంగులు, ఇతర స్వచ్ఛంద కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న స్నేహ సొసైటీ ప్రిన్సిపల్ జ్యోతి, కార్యదర్శి సిద్దయ్యలు సమాజానికి ఆదర్శప్రాయులని సొసైటీ అధ్యక్షులు డాక్టర్ మహిపాల్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ సవితా రాణి కొనియాడారు. వారు చేసిన సేవలో మేము, సిబ్బంది సైతం ఒక సమిద కావడం ఎంతో సంతృప్తినిస్తుందని వారు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో స్నేహ సొసైటీ 34వ సాధారణ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన స్నేహ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎం. మహిపాల్ , వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సవితారాణి, స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్. సిద్దయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్. సిద్దయ్య స్నేహ సొసైటీ ఏర్పడిన నాటి నుండి అందిస్తున్న సేవలను మరియు ఎదుర్కొన్న ఒడిదుడుకులను అలాగే ప్రోత్సాహించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరియు జిల్లా కలెక్టర్లు అధికార యంత్రాంగం అందిస్తున్న ప్రతి విషయాన్ని క్లుప్తంగా వివరించారు. 2025– 26 సంవత్సరంలో ఆదాయం మరియు ఖర్చులు ఇతర ఇతర విషయాలను తెలియజేశారు..

**ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ,**

అప్పటి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తో పాటు గత కలెక్టర్లు డాక్టర్ యోగితా రానా మరియు ఇతర అధికారుల ప్రోత్సాహంతో దివ్యాంగుల అభ్యున్నతికి తమకు సహకారం అందించడం జరిగిందన్నారు.. అంధ విద్యార్థులకు నూతన పాఠశాల భవనాన్ని ప్రారంభించడం పట్ల స్నేహ సొసైటీ పాఠశాల అధ్యక్షులు డాక్టర్ మహిపాల్ స్నేహ సొసైటీ ప్రిన్సిపల్ జ్యోతి, కార్యదర్శి ఎస్ సిద్దయ్య లను ప్రత్యేకంగా అభినందించారు.. ఇన్ని సంవత్సరాలుగా ఎంతోమంది విద్యార్థుల ఉన్నతి కోసం కృషి చేస్తున్న స్నేహ సొసైటీ ప్రతి ఒక్క సిబ్బంది సహకారంతోనే స్నేహ సొసైటీ ఎంతోమంది దివ్యాంగుల ఉన్నతి సాధ్యమవుతుందన్నారు. నిజామాబాద్ మంచిర్యాల , బైంసాలలో స్నేహ సొసైటీ సేవలు అందించడం జరుగుతుందన్నారు. అయితే ముఖ్యంగా ఈ సంవత్సరం స్నేహ సొసైటీ సంస్థలో ఉన్న సిబ్బంది అందరితో కలిసి ఒక కో–ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటుచేసి సరుకులను తక్కువ ధరకు సిబ్బందికి అందించే విధంగా శ్రీకారం చుట్టేందుకు మరో ముందడుగు వేసినందుకు స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్యను డాక్టర్ సవిత రాణి మరియు స్నేహ సొసైటీ కమిటీ సభ్యులందరూ అభినందించారు.. ఇంతటి మంచి అవకాశాన్ని స్నేహ సొసైటీ సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.. అలాగే ఏదైతే కోపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసేందుకు తమ వంతు సహకారాలు అందజేస్తామని అతి తక్కువ ధరలో సరుకులను ఇప్పించే విధంగా కృషి చేస్తామని స్నేహ సొసైటీ కమిటీ సభ్యులు సభ ముఖంగా తెలిపారు. స్నేహ సొసైటీ దివ్యంగుల ఉన్నతి కోసం డాక్టర్ సవితా రాణి లక్ష రూపాయల ఆర్థిక సహాయం విరాళంగా అందించడం ఎంతో గొప్ప విషయం అన్నారు.. అలాగే రమణారెడ్డి విద్యార్థుల సంక్షేమం కోసం ప్రతి ఏటా వారి కూతురు పుట్టిన రోజు సందర్భంగా 25 వేల ఆర్థిక సహకారం మరియు అన్న ప్రసాదాన్ని అందించడం అలాగే ఎల్లప్పుడూ పిల్లల మంచి చెడుల కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. స్నేహ సొసైటీ ఉపాధ్యక్షులు డాక్టర్ సవితారాణి మాట్లాడుతూ, స్నేహ సొసైటీ అందిస్తున్న సేవలు చాలా గొప్పవని కొనియాడారు.. అసలు స్నేహ సొసైటీలో ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నప్పటికీ వైద్య వృత్తిలో తప్పని పరిస్థితుల్లో అనుకున్నంత సమయం కేటాయించలేకపోతున్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒకటి కాదు రెండు కాదు అందుల పాఠశాల మరియు మానసిక దివ్యాంగుల పాఠశాల అలాగే సఖి సెంటర్ ద్వారా మరియు సెక్స్ వర్కర్ల ఆరోగ్య రీత్యా ఇలా చెప్పుకుంటూ పోతూ ఉంటే ఎన్నో రకాల సేవలు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ ఒక్క పాఠశాలలో చదువుకున్న ఒక అంధ విద్యార్థిని రజిని తాను చదువుకున్న పాఠశాలకు 50 వేల రూపాయలు ఇవ్వడం ఎంతో చెప్పుకోదగ్గ విషయం అని కొనియాడారు.. ప్రిన్సిపాల్ జ్యోతి, కార్యదర్శి సిద్దయ్య వారి సేవలు ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదని అన్నారు. స్నేహ సొసైటీ లోని ప్రతి ఒక్క సిబ్బంది సహకారంతోటే తొలుత 1992లో ఏర్పాటు చేసి అంధ విద్యార్థుల పాఠశాల ప్రారంభం నుండి ఎన్నో ప్రాజెక్టుల ద్వారా ఎంతోమంది సేవలో భాగ్యస్వాములు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అందరితోపాటు స్నేహ సొసైటీ సిబ్బంది సంక్షేమం, ఆర్థికంగా బలోపేతం కావడానికి కోపరేటివ్ సొసైటీ ఏర్పాటుకు ముందుకు రావడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని సూచించారు.. రానున్న రోజుల్లో తన వంతు సహకారం ఎల్లప్పుడూ స్నేహ సొసైటీకి అందజేస్తానని వారు తెలిపారు.

**సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ భానుప్రియ మాట్లాడుతూ,**

స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సఖి సెంటర్ లో తన వంతు బాధ్యతగా సేవలు అందించే అవకాశం కల్పించినందుకు స్నేహ సొసైటీ కార్యదర్శి మరియు జ్యోతికి కృతజ్ఞతలు తెలియజేశారు.. అసలు ఇలాంటి అవకాశం వస్తుందని అనుకోలేదని, వచ్చిన తర్వాత ఇక్కడ దివ్యాంగుల పాఠశాలలో చిన్నారులు మరియు వారి ఎదుగుదల వారు రాష్ట్రీయ జాతీయస్థాయిలో రాణించడం మరియు ప్రభుత్వ ఉద్యోగాల్లో సైతం స్థిరపడేందుకు స్నేహ సొసైటీ సిబ్బంది కృషి ఏ విధంగా జరుగుతుందో చాలా విషయాలు తెలుసుకోవడం జరిగిందని ఆమె తెలిపారు.. టిఐ ప్రాజెక్టు మేనేజర్ శివ మాట్లాడుతూ, సెక్స్ వర్కర్లు ట్రాన్స్ జెండర్లు మరియు ఎయిడ్స్ నివారణ ప్రాజెక్టు ద్వారా సేవలందించే దిశగా మరియు వారి ఆరోగ్య రీత్యా భాగోగుల కోసం ఎల్లప్పుడూ కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అసలు స్నేహ టార్గెట్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్టు ద్వారా ఎన్నో రకాల సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి శాలువలు జ్ఞాపకలతో ఘనంగా సన్మానించారు.. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు షేర్ల దయానంద్, తాటి వీరేశం, సుధాకర్ మరియు స్నేహ సొసైటీ లోని ఆయా ప్రాజెక్టులో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది మరియు టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.